

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 248 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం, 07, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# మంత్రుల మాటలకు.. విలువెక్కడ?

**అధికారుల ఇష్ట రాజ్యానికి హద్దులు లేకుండా పోతున్నాయి**

**మంత్రుల మాటలు వినకపోవడంతో ప్రభుత్వంలో మందకోడి పాలన సాగుతుంది**

**అధికారు పదోన్నతుల్లో అన్ని అక్రమాలే**

**ఉద్యోగుల బదిలీల్లో ఊహకందని పైరవీలు**

**కావాలని చేస్తున్నారా అధికార అహం పెంచుకుంటున్నారా !**

**దారి తప్పుతున్న ప్రజాపాలనకు అధికారులే కారణమా !**

**మంత్రుల మాటలనే ధిక్కరిస్తే ప్రజలకు ఎలా సేవ చేస్తారు**

**ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేయలేకపోతున్న అధికారులు**

**ప్రతిపక్షాల విమర్శలకు అధికారుల తీరే కారణం**

**ఉద్యోగులను వేధిస్తున్న అధికారుల పట్ల చర్యలు ఎక్కడ : డాక్టర్ బరిగెల శివ**



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

**హైదరాబాద్(జై భీమ్ డెస్క్)**

ప్రభుత్వ అధికారుల తీరు పట్ల ప్రజలు పూర్తిగా అసంతృప్తితో ఉన్నారని డాక్టర్ బరిగెల శివ అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసేవ కొరకు ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ పరిపాలన పేరును ప్రగతి భవన్ పరిపాలన నుండి ప్రజా పాలన ప్రభుత్వంగా మార్చుకొని ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేస్తామని ప్రభుత్వ ఏర్పాటు ఆధీనంలోనే ప్రజలకు హామీ ఇవ్వడం పట్ల తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంతో నమ్మకం పెంచుకున్నారని అలాంటి నమ్మకాన్ని ఆదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పోగొట్టుకున్నదని స్పష్టం చేశారు.ప్రజల నమ్మకానికి ప్రజల విశ్వాసానికి అనుకూలంగాను, సానుకూలంగానూ పనిచేయాల్సిన ప్రజాప్రతినిధులు మంత్రులు పేద ప్రజలను కలవకుండా ప్రజా సమస్యలను పరిష్కరించకుండా సుమారుగా రెండు సంవత్సరాలు రాజకీయ ఆధిపత్యం పోరులోనే రగిలిపోయారు తప్ప ప్రజలకు ఉన్నత స్థాయిలో సేవ చేసిన పరిస్థితిలు చాలా తక్కువ అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా ప్రతినిధుల మధ్య మంత్రుల మధ్య వర్గ పోరు ఎక్కువైపోయి ఆధిపత్య పోరులో ఒకరి శాఖలో

- మిగతా 2లో..

## తెలంగాణ పోలీస్ శాఖకు దేశంలోనే ప్రధాన స్థానం.

**సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్: డైరెక్టర్ షిఖా గోయల్**


**ప్రధానమంత్రి కార్యాలయం నిర్వహించిన 'ప్రగతి' సమీక్షలో అగ్రస్థానం**

**9 కీలక విభాగాల్లో మెరుగైన పనితీరుకు కేంద్ర ప్రభుత్వ ప్రశంసలు.**

**బాధితుల కోసం ప్రత్యేక సహాయ కేంద్రం నంబరు 8712665600 ప్రారంభం.**

**పోలీస్ శాఖ ప్రవృత్తిని బలపరుస్తున్న ఐపీఎస్ అధికారులు.**

తెలంగాణ పోలీస్ శాఖకు దేశవ్యాప్తంగా పేరు ఉంది.




3

## రాయదుర్గం భూముల కేసులో సుప్రీం కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ,ఆగస్ట్6(జై భీమ్ న్యూస్):**

హైదరాబాద్ రాయదుర్గం భూముల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. టీజీఐఐసీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ముగిసిందని తెలిపింది. ఈ క్రమంలోనే తెలంగాణ హైకోర్టు ఆదేశించిన డ్రోన్ సర్వేపై సుప్రీంకోర్టు స్టే విధించింది. యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. తమ వాదనలు వినకుండానే సర్వే ఆదేశాలు ఇచ్చారని టీజీఐఐసీ వాదనలు వినిపించింది. అయితే, హైకోర్టులో ఇంప్లీడ్ అయ్యేందుకు సుప్రీంకోర్టు అనుమతిచ్చింది. ఆగస్టు 14వ తేదీ వరకు టీజీఐఐసీకి గడువు విధించింది. ఆ లోగా హైకోర్టులో సవరణ దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. రాయదుర్గం సర్వే నంబర్ -83/2లోని 46 ఎకరాల భూమిని వేలం వేసే ప్రతిపాదన లేదని సుప్రీంకోర్టుకు టీజీఐఐసీ సీనియర్ న్యాయవాది తెలిపారు.

## విద్య వ్యాపార వస్తువుగా మారింది


**ఎల్‌కెజికే లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారు**

**నిరుద్యోగం, ఫీజుల దోపిడీ, ప్రభుత్వ వ్యవస్థల నిర్వీర్యంపై పోరు**

**క్యా బోల్తీ పబ్లిక్ పేరిట...దేశ వ్యాప్త పర్యటనలు**

**ప్రెజర్ గ్రూపుగా పనిచేసేందుకే నిర్ణయం**

**కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే**




2

## జయశంకర్ సార్‌కు సిఎం రేవంత్ నివాళి



**హైదరాబాద్,ఆగస్ట్6(జై భీమ్ న్యూస్):** ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళు లర్పించారు. సిద్ధాంతకర్తగా తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడని ఆయన కొనియాడారు.ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem సామాన్యుడి ఆయుధంగా

# ఆచార్య జయశంకర్ స్ఫూర్తి ప్రదాత

**కళల సాకారాన్ని సాఫల్యం చేసిన మహనీయుడు**
**మేదోవంతమైన సమాజం కొరకు పరితపించారు**
**విద్యా ప్రమాణాలకు విలువనిచ్చారు**
**విద్యా సంస్థల అభివృద్ధికి ప్రధాన ప్రాధాన్యతనిచ్చారు**
**తెలంగాణ రాష్ట్ర సాధనను రచించిన మహనీయులు**
**ఆచార్య జయశంకర్ ఆశయాలను కడవరకు కొనసాగించాలి**
**కేయూ ఈసీ మెంబర్ డాక్టర్ అనిత రెడ్డి**





**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:-**

తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రప్రదమైన మార్గాలను నిర్మించిన ఆచార్య జయశంకర్ జయంతి కాకతీయ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించబడింది.గురువారం కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనిత రెడ్డి ప్రత్యేక అతిథిగా పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘన నివాళి అర్పించి, జయశంకర్ ఫోటో గ్యాలరీని సందర్శించడం జరిగిందని కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనిత రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ అనిత రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళలను నిజం చేసిన మహనీయులుగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఏర్పాట్లు నిర్మాణాత్మకమైన చరిత్రను సృష్టించిన మహోన్నత మేధావిగా ఆచార్య జయశంకర్ వెలిగొందారని పేర్కొన్నారు. మహనీల చరిత్ర కాల పరిమితులతో పాటు కొనసాగుతూనే ఉంటుందని గుర్తు చేశారు.చరిత్రకే గొప్పతనాన్ని చాటి చెప్పిన ఆచార్య జయశంకర్ అమరవీరుల ఆశయాలకు తెలంగాణ రాష్ట్ర సాధన పునాదులు వేసారని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చారిత్రాత్మకంలో ఆచార్య జయశంకరుని పాత్ర అమోఘమని, వర్ణించడానికి వీలుపడలేనంత త్యాగాన్ని కనపరిచారని గర్వపడ్డారు.కోట్ల కొలది గొంతుకుగా మారిన ఆచార్య జయశంకర్ ఆశయం కలకాలం నిలిచిపోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.ఆచార్య జయశంకర్ సిద్ధాంతాలను, మేధోమదనాన్ని, తెలంగాణ రాష్ట్ర సాధనలో అతను కొనసాగించిన ప్రయత్నాలను సంపూర్ణమైన ఆధారాలతో తెలంగాణ రాష్ట్ర ప్రజలే కాకుండా దేశ ప్రజలందరూ వీక్షించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన ప్రదర్శన ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

# ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి



**హన్మకొండ, 6 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని హనుమకొండలో గురువారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండ ఏకశిలా పార్కులోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ టి. వెంకన్న పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను భావితరాలకు చాటిచెప్పాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శేషాద్రి, హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ సీహెచ్‌వో లక్ష్మారెడ్డి, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు, ఇతర శాఖల అధికారులు, వాకర్స్, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొని ఆచార్య జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# మంత్రుల మాటలకు విలువెక్కడ

మొదటి పేజీ తరువాయి



మరొకరు తలదూరుస్తుతుండడమే కాకుండా రహస్య సమావేశాలు ఏర్పాటు చేసుకుంటూ ఒకరిపై మరొకరు నిందలు వేసుకుంటూ కాంగ్రెస్ పాలనను అభాసపాలు చేశారని గుర్తు చేశారు.దానిని ఆసరాగా చేసుకున్న ప్రభుత్వ శాఖలోని ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు మంత్రుల మాటలు వినకుండా ఇష్టరాజ్యమైన అధికార పరిపాలన కొనసాగిస్తుండటం వల్ల ప్రజలకు ప్రభుత్వ అధికార కార్యాలయాల సేవలు అనుకున్న స్థాయిలో అందించబడకుండా పూర్తిగా నీరు కారిపోయాయని మండిపడ్డారు.రెవెన్యూ శాఖలో విద్యాశాఖలో వైద్య శాఖలో పోలీస్ శాఖలో దేవాదాయ శాఖలో విద్యుత్ శాఖలో మున్సిపల్ శాఖలో ఐటీ శాఖలో పౌరసరఫరాల శాఖలో అధికారులు ఒంటెద్దుపోకడలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు.తెలంగాణలో ప్రభుత్వ ఆస్తులకు కాకుండా ప్రైవేట్ ఆస్తులకు కూడా రక్షణ లేకుండా పోవడానికి బలమైన కారణం ఉన్నత అధికారులు పేద ప్రజల వైపు లేకపోవడమే పేద ప్రజలకు పేద ప్రజల హక్కులకు పూర్తిగా నష్టం జరుగుతుందన్నారు.

**మంత్రుల మాటలను పెడచెవిన పెడుతున్నారు..**

తెలంగాణ రాష్ట్రంలో ప్రధానమంత్రిత్వ శాఖలన్నీ అగ్రవర్ణాల చేతిలో బందీయై పోయినందున ప్రభుత్వ ఉన్నత అధికారులు ఏకపక్ష పైరవీలకు అలవాటు పడి ప్రభుత్వ కార్యాలయాలను పూర్తిస్థాయిలో శాసిస్తున్నారని దానివల్ల ప్రజలకు సేవ చేయడం తగ్గించి అధికార హోదాలను ఆస్వాదించడానికి, అధికార పదవుల్లో ఆనందపడడానికి, వాటితో పాటు అధికార పదవులలో ఆస్తులను సంపాదించుకోవడానికి మాత్రమే ఉత్సుకతను కనబరుస్తున్నారు తప్ప ప్రజలకు రక్షణగా నిలువలేక పోతున్నారని బాహాటంగా హెచ్చరించారు.ఈ మధ్యకాలంలో జరిగిన ప్రధాన సంఘటనలో భాగంగా తెలంగాణలో మంత్రుల మాటలు వినని అధికారులు అంటూ ప్రజలు బాహాటంగా చర్చించుకోవడం చర్చనీయాంశంగా మారిందన్నారు.అటవీ శాఖలో మంత్రి కొండా సురేఖ చెప్పిన పట్టించుకోకుండా 25 మంది అధికార సిబ్బంది డిప్యూటేషన్లను రద్దు చేసిన ప్రధాన అటవీ సంరక్షణ అధికారి వినయ్ కుమార్ తీరు పట్ల తీవ్రమైన విమర్శలు వస్తున్నాయన్నారు.అదే సందర్భంలో మంత్రులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ జూపల్లి కృష్ణారావు తుమ్మల నాగేశ్వరరావు టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, సంజయ్ అటవీ పరిరక్షణ శాఖ అధికారిని కోరినప్పటికిని పట్టించుకోకపోవడంతో అధికార పెత్తనం చెలాయించినట్లుగా అధికార వర్గాల్లో తీవ్రంగా చర్చ నడుస్తుందన్నారు.మంత్రుల కింద పనిచేయాల్సిన అధికారే ఇంతలా చలాయించుకుంటూ డిప్యూటేషన్లను రద్దు చేయడం పట్ల సంబంధిత అధికారులు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు.పరిస్థితుల దృష్ట్యా కుటుంబ అవసరాల రీత్యా తమను మరోచోటకు అంతకన్నా మరో శాఖకు డిప్యూటేషన్ పై పంపించాలని మంత్రులను నాయకులను కోరిన అటవీ శాఖలోని 25 మంది అధికారుల ఫైళ్లను గత అటవీ సంరక్షణ శాఖ అధికారి సువర్ణ ఆమోదించి డిప్యూటేషన్లను జూన్ 30న పదవుల బాధ్యతలను స్వీకరించే విధంగా సహకరించినప్పటికీ వినయ్ కుమార్ అధికారిగా బాధ్యతలు చేపట్టాక తక్షణమే అట్టి డిప్యూటేషన్లను రద్దుచేయడం అటవీ శాఖలో పెద్ద దుమారం రేపిందన్నారు.అటవీ సంరక్షణ అధికారి వినయ్ కుమార్ రద్దు చేసిన డిప్యూటేషన్లను పునరుద్ధరించి మంత్రులు సూచించిన మేరకు అధికారులకు ఆయా ప్రాంతాల్లో అవకాశం కల్పించిన మంత్రి సురేఖ అట్టి అధికారులను తక్షణమే డిప్యూటేషన్లపై పంపాలని సంబంధిత అధికారి వినయ్ కుమార్ కు సూచించినప్పటికీ సంబంధిత శాఖ మంత్రి ఆదేశించినప్పటికిని మంత్రి ఆదేశాలను బేకతారు చేస్తూ పట్టించుకోకుండా పెడచెవిన పెడుతున్న అటవీ రక్షణ శాఖ అధికారి తీరు ప్రభుత్వంపై తీవ్రమైన విమర్శలు వచ్చేలా చేస్తుందన్నారు.సంబంధిత మంత్రి చెప్పిన రాష్ట్ర మంత్రులు చెప్పిన ఒక ఉన్నతాధికారి పట్టించుకోకుండా పెడచెవిన పెట్టడం వెనకాల ఒక రాష్ట్ర మంత్రి రహస్య పెత్తనం చెలాయించుకోవడం కోసం ఉన్నతాధికారి వెనుక ఉండి రాజకీయం నడిపిస్తున్నాడని అధికార వర్గాల్లో రాజకీయ వర్గాల్లో తీవ్రమైన చర్చ సాగుతుందన్నారు.సరిగ్గా ఇదే తీరును ప్రతి శాఖలోని ఉన్నతాధికారులు ప్రదర్శిస్తూ సంబంధిత ఉద్యోగులను వేధిస్తూనే అధికార పెత్తనాన్ని చెలాయిస్తూ ప్రభుత్వానికి తీరని నష్టాన్ని తెచ్చిపెడుతున్నారని సూటిగా ప్రశ్నించారు.రాష్ట్రాన్ని వ్యక్తిగతంగా పాలించడానికి కేవలం కొంతమంది రాజకీయ నాయకులు అన్ని ప్రభుత్వ శాఖలను అన్ని మంత్రిత్వ శాఖలను శాసిస్తూ ఇతర మంత్రిత్వ శాఖలో తలదరుస్తూ మహిళా మంత్రులను అవమాన పరుస్తుండమే కాకుండా రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయిస్తూ ప్రజాస్వామ్య విలువలను రాజకీయ విలువలను వ్యక్తిగత స్వార్థాలకు వాడుకుంటూ దిగజారుస్తున్నారని హెచ్చరించారు.ఈ విధంగా ప్రభుత్వ శాఖలలో అధికార ఆధిపత్యం చెలాయించుకోవడం కోసం ప్రతి ప్రభుత్వ శాఖలలోని ఉన్నతాధికారులు ప్రభుత్వంలో బలం ఉన్నటువంటి నాయకులకు తొత్తులుగా పనిచేస్తుండడం వల్ల రాజకీయ విలువలకు అర్థం లేకుండా పోయి ప్రజాసేవకు అన్నిచోట్ల విఘాతం కల్పించబడుతున్నాయన్నారు.కొన్ని శాఖల్లోనైతే ఉన్నతాధికారుల తీరు కేవలం ప్రజలను వేధించడానికి మాత్రమే ఉపయోగిస్తున్నట్లుగా కనిపిస్తుందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో పెరిగిపోతున్న ప్రజా వేధింపులకు బలమైన సూత్రధారులుగా ఉన్నతాధికారుల అధికార ఒంటెద్దు పోకడలు కనిపిస్తున్నట్లుగా ప్రజల అనుమానాలకు బలమైన సాంకేతాలను ఉన్నతాధికారులే ఆద్యం పోస్తున్నారన్నారు. రాజకీయ బలబలా స్వార్థ ప్రయోజనాలు బలపరచుకోవడం కోసం ఎత్తుకు పైఎత్తుల ఎత్తుగడలను ప్రదర్శిస్తున్నారన్నారు.ప్రజాసేవ చేయడానికి పనికిరాని నాయకులందరూ ఇతరుల మంత్రిత్వ శాఖలలో తలదూరుస్తూ తీవ్రమైన విమర్శలకు కారకులవుతున్నారని హెచ్చరించారు.అదును దొరికిన ప్రతిసారి అవినీతికి పాల్పడుతున్న మంత్రులందరూ మంత్రి కొండా సురేఖ శాఖలో పెత్తనం చెల్లించాలని చూస్తూ రాజకీయ సేవలకు ఎందుకు పనికిరాని పనులు చేస్తున్నారని తెలంగాణ ప్రజలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారన్నారు.ఎన్నిసార్లు హెచ్చరించిన రహస్య రాజకీయాలకు పాల్పడుతున్న మంత్రుల స్వభావం మారకపోవడంతో చేసేదేమీ లేక ప్రజలే అదును కోసం ఎదురుచూస్తున్నారని ప్రజలకు అవకాశం దొరికిన సందర్భంలో పదంతల వడ్డీతో సహా రాజకీయ అహంకారాన్ని పాతాళానికి తొక్కే ఫలితాన్ని ఇవ్వడానికి అన్ని విధాలుగా సంసిద్ధంగా ఉండబోతున్నట్లు గుర్తుచేశారు.రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదని ఆధిపత్యం శాశ్వతం కాదని అధికారం శాశ్వతం కాదని ప్రతి ఒక్కరికి తెలిసినప్పటికీ సొంత శాఖలో పనిచేయ చాతనవ్వని నాయకులంతా పక్కశాఖలో తలదూరుస్తూ వాళ్లకు వాళ్లే బదనమవుతున్నారని హెచ్చరించారు.రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వ మంత్రిత్వ శాఖలలో ఏ శాఖ నిజాయితీగా సమర్థవంతంగా పనిచేస్తుందో చెప్పగలరా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించగలిగితే ఏ ఒక్క శాఖ ప్రజలకు అనుకున్న విధంగా సేవ చేయలేకపోతుందని వాటితోపాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో విపరీతమైన లోటుపాట్లు ఏర్పడుతున్నాయని మొత్తం మీదుగా రాష్ట్ర పాలన నాయకుల మధ్య ప్రజాప్రతినిధుల మధ్య మంత్రుల మధ్య వర్గ పోరు విభేదాలను పెంచుతుండగా మంత్రుల మాట ప్రజాప్రతినిదుల మాట వినకుండా ఉన్నతాధికారులందరూ అంతర్గత రాజకీయదారులుగా పేరు తెచ్చుకుంటున్నారని తీవ్రంగా విమర్శల పాలవ్వడాన్ని హెచ్చరించారు.అధికారుల తీరు మారకపోవడం ప్రజా ప్రతినిధుల పద్ధతి ప్రజాసేవకు ఆటంకం పెంచుతున్నంతకాలం కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు ఏమాత్రం విశ్వాసం పెరగడనేది వాస్తవమన్నారు.నిరుద్యోగుల గోస రైతుల ఆరిగోశ విద్యా వ్యవస్థలో అవినీతి దోపిడీ ఉన్నత అధికారుల ఆధిపత్య పరాకాష్టకు నిదర్శనంగా మారిపోతుండగా మంత్రులు వాళ్ల వాళ్ల వ్యాపారాల్లో పూర్తిగా నిమగ్నమైపోయి నిరుద్యోగులను రైతులను విద్యారంగాన్ని వైద్య రంగాన్ని పూర్తిగా విడమరుస్తున్నారని అన్నారు.సంవత్సర కాలం పాటు అధికార పదవుల్లో పని చేసే ఉన్నతాధికారులే ఇంతటి స్వార్థాన్ని ప్రదర్శిస్తే ప్రజా సమస్యల పరిష్కారం మార్గాలకు అవకాశాలు ఎలా లభించబడతాయంటూ సూటిగా నిలదీశారు.ప్రజాపాలన కాస్త పరువు తీసుకునే పాలనగా మారిపోతుందని ప్రజల అభిప్రాయాలను ఒక్కనించి చెప్పారు.

# విద్య వ్యాపార వస్తువుగా మారింది

**ఎల్‌కెజికే లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారు**
**నిరుద్యోగం, ఫీజుల దోపిడీ,ప్రభుత్వ వ్యవస్థల నిర్వీర్యంపై పోరు**
**క్యా బోల్తీ పబ్లిక్ పేరిట...దేశ వ్యాప్త పర్యటనలు**
**ప్రెజర్ గ్రూపుగా పనిచేసేందుకే నిర్ణయం**
**కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే**

**ముంబై,ఆగస్ట్6(జై భీమ్ న్యూస్):**

కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్' అంటే ప్రజలు ఏమంటున్నారు... పేరుతో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజల వద్దకు తీసుకెళ్తామని ఆయన తెలిపారు. విద్యార్థి నిరసనలతో దేశం దృష్టి ఆకర్షించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక ప్రకటన చేసింది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు 'క్యా బోల్తీ పబ్లిక్' పేరిట జాతీయస్థాయి ప్రచారం నిర్వహిస్తామని వెల్లడించింది. ప్రజల ఆందోళనలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, అభిప్రాయాలను తీసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని స్పష్టం చేసింది. సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటించి ప్రతి ఒక్కరితోనూ మమేకమవుతామని తెలిపారు. సీజేపీ ఒక రాజకీయ పార్టీగా మారకుండా ఒక ఒత్తిడి బృందంగానే కొనసాగుతుందని దీప్కే ప్రకటించారు. మహారాష్ట్రలో నిర్వహించిన పార్టీ ప్రధాన బృంద సమావేశం అనంతరం దీప్కే ఈ ప్రకటన చేశారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశం లేదని, ప్రజల తరఫున ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రెషర్ గ్రూప్‌గా పనిచేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలపై ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ రోజు మన దేశంలో సంస్థాగత జవాబుదారీతనం ప్రమాదకర స్థితిలో ఉంది. ఇది మన ప్రజాస్వామ్యానికి ఒక ప్రమాదకర సంకేతం. గతంలో ఓటర్లు ప్రభుత్వాన్ని ఎన్నుకునేవారు. ఈ రోజు ఎవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ప్రజాస్వామ్యం ఇలా పనిచేయదు. మనం ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని సరిదిద్దాలి. మనం ఇది చేసేంత వరకు దేశంలో ఎన్నికల అవకతవకలు కొనసాగుతాయి' అని దీప్కే పేర్కొన్నారు. నిరుద్యోగం దేశంలో ఒక ప్రధాన సమస్య అని, దీనిని దేశవ్యాప్త సమస్యగా పరిగణిస్తామని దీప్కే తెలిపారు. భారతీయ కుటుంబాలకు నాణ్యమైన విద్య రోజురోజుకూ భారంగా మారుతోందని, అందుకే ఆ అంశంపైనే తొలుత తాము దృష్టిసారిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. సెప్టెంబర్ నుంచి ప్రజల్లోకి వెళ్తామని మీడియా వేదికగా తెలియజేశారు. ఒకటో తరగతికే ఫీజులు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో ఇంకా ఎక్కువే ఫీజులు ఉంటున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఆ మొత్తాన్ని ఎలా భరిస్తాయి. ఈ ఖర్చుల వల్ల ప్రజలు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఆ భారం తగ్గాలని మా పార్టీ కోరుకుంటోంది. తల్లిదండ్రులు పిల్లలకు ఉన్నత విద్య అందించాలనుకున్నప్పుడు దానిని వారు భారంగా భావించకూడదు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చెప్పిన ప్రకారం.. విద్య ప్రాథమిక హక్కు. గత కొన్నేళ్లుగా అది ఒక వ్యాపారంగా మారిపోయిందని దీప్కే ఆందోళన వ్యక్తంచేశారు. తమ ప్రచారంలో పాల్గొనాలనుకునేవారు అధికారిక క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయాలని సూచించారు. ఆ క్యూఆర్ కోడ్‌లను మీడియా సమావేశంలో ప్రదర్శించారు. సభ్యత్వం పూర్తిగా ఉచితమని చెప్పారు. మోసపూరిత చెల్లింపు అభ్యర్థనల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా... ఒత్తిడి తెచ్చే సంస్థగా సీజేపీ పనిచేస్తుందని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. రాజకీయ పార్టీల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రజలు ఉదయం ఒక పార్టీకి ఓటేస్తే సాయంత్రంకల్లా మరో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఆయన అన్నారు.

# తెలంగాణ పోలీస్ శాఖకు దేశంలోనే ప్రధాన స్థానం

**సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్: డైరెక్టర్ షిఖా గోయల్**

**ప్రధానమంత్రి కార్యాలయం నిర్వహించిన 'ప్రగతి' సమీక్షలో అగ్రస్థానం**

**9 కీలక విభాగాల్లో మెరుగైన పనితీరుకు కేంద్ర ప్రభుత్వ ప్రశంసలు.**

**బాధితుల కోసం ప్రత్యేక సహాయ కేంద్రం నంబరు 8712665600 ప్రారంభం.**

**పోలీస్ శాఖ ప్రవృత్తిని బలపరుస్తున్న ఐపీఎస్ అధికారులు.**

**తెలంగాణ పోలీస్ శాఖకు దేశవ్యాప్తంగా పేరు ఉంది.**



**హైదరాబాద్ జై భీమ్ న్యూస్:**

సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు వేగవంతమైన సహాయం అందించడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షిఖా గోయల్ వెల్లడించారు. ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి 'ప్రగతి' వీడియో కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశంలో కేంద్ర హోంశాఖ పరిధిలోని 'భారత సైబర్ నేరాల సమన్వయ కేంద్రం' అభివృద్ధి చేసిన డిజిటల్ వ్యవస్థల వినియోగం, పనితీరు ఆధారంగా తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానం సాధించిందని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా 'రాష్ట్ర సైబర్ నేరాల సమన్వయ కేంద్రం' ఏర్పాటు చేయడం, 'డిజిటల్ జీరో ప్రథమ సమాచార నివేదిక' అమలు చేయడంతో పాటు సమన్వయ, సహాయోగ్, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, బాధితుల మనీ రీస్టోరేషన్ వ్యవస్థ వంటి కీలక డిజిటల్ వేదికలను అత్యంత సమర్థవంతంగా వినియోగిస్తున్నందుకు గాను తెలంగాణ రాష్ట్ర యంత్రాంగాన్ని ప్రధానమంత్రి కార్యాలయం ప్రత్యేకంగా అభినందించిందని డైరెక్టర్ పేర్కొన్నారు.

**అగ్రస్థానానికి నడిపించిన 9 కీలక అంశాలు:**

రాష్ట్రంలో సైబర్ నేరాల సమన్వయ కేంద్రాల ఏర్పాటు

డిజిటల్ జీరో ప్రథమ సమాచార నివేదిక సమర్థవంతమైన అమలు

ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా సమస్యల నివారణ

బాధితులకు కాజేసిన సొమ్మును తిరిగి అందించే మనీ రెస్టోరేషన్ వ్యవస్థ నిర్వహణ

చట్టవిరుద్ధమైన డిజిటల్ సమాచార తొలగింపుకు 'సహాయోగ్' వేదిక వినియోగం

సమన్వయ వేదిక ద్వారా వివిధ రాష్ట్రాల పోలీసుల సమాచార మార్పిడి

సైబర్ నేరాలు ఎక్కువగా జరిగే తీవ్ర ప్రాంతాల గుర్తింపు, నిరోధం

చట్ట అమలు అధికారులకు ప్రత్యేక శిక్షణా వేదికలు, సైబర్ విభాగాల ద్వారా శిక్షణ

సమాచారం, విద్య, ప్రచార విభాగాల ద్వారా విస్తృత ప్రజా అవగాహన

కీలక డిజిటల్ వేదికల పురోగతి, గణాంకాలు (ఆగస్టు 02, 2026 నాటికి):

**1. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ:**

బ్యాంకు ఖాతాల నిలిపివేత, పునరుద్ధరణ, ఖాతాలపై లావాదేవీల ఆంక్షల తొలగింపుకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారానికి పోలీసు విభాగాలు, బ్యాంకింగ్ వంటి ఆర్థిక సంస్థల మధ్య సమన్వయం కోసం ఈ వ్యవస్థ పనిచేస్తుంది.

మొత్తం వచ్చిన అభ్యర్థనలు: 2,368

చర్యలు తీసుకుని పరిష్కరించినవి: 2,086

పరిష్కార శాతం: 88%

**2. బాధితుల మనీ రెస్టోరేషన్ వ్యవస్థ:**

సైబర్ నేరగాళ్లు కాజేసిన సొమ్మును బాధితులకు వేగంగా తిరిగి అందించడానికి ఇది దోహదపడుతుంది. రూ.50,000 వరకు పోగొట్టుకున్న మొత్తాన్ని ఎలాంటి ప్రథమ సమాచార నివేదిక లేదా న్యాయస్థానం ఉత్తర్వులు లేకపోయినా నిబంధనల ప్రకారం నేరుగా ఈ వేదిక ద్వారా తిరిగి పొందవచ్చు. రూ.50,000 దాటిన సొమ్ముకు ప్రథమ సమాచార నివేదిక, న్యాయస్థానం ఉత్తర్వులు అవసరం.

తిరిగి పొందదగిన కేసుల సంఖ్య: 34,524

తిరిగి పొందదగిన మొత్తం సొమ్ము: రూ.16.42 కోట్లు

పోలీసు విభాగం జారీ చేసిన ఆదేశాలు: 28,097

ఉత్తర్వుల శాతం: 81.38%

**3. సహాయోగ్ వేదిక:**

సామాజిక మాధ్యమాలు, ఇతర అంతర్జాల వేదికల్లో ఉండే చట్టవిరుద్ధమైన అంశాలను తొలగించడానికి, అంతర్జాల చిరునామాలను నిరోధించడానికి పోలీసులు ఈ వేదికను ఉపయోగిస్తారు.

**మొత్తం విజ్ఞప్తుల సంఖ్య: 1,529**

మొత్తం అంతర్జాల చిరునామాలు: 22,447

తొలగించిన/నిరోధించిన అంతర్జాల చిరునామాలు: 20,070

తొలగింపు శాతం: 89.41%

**4. సమన్వయ వేదిక:**

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల పోలీసు విభాగాల మధ్య సైబర్ నేరాల సమాచారం, నేరస్థుల వివరాలు, కేసుల పురోగతిని పంచుకోవడానికి ఇది సహాయపడుతుంది.

ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన విజ్ఞప్తులు: 6,721

పూర్తయినవి: 6,518 (పెండింగ్ 203)

పూర్తయిన శాతం: 96.68%

ఇతర రాష్ట్రాలకు పంపిన విజ్ఞప్తులు: 7,018

పూర్తయినవి: 5,560 (పెండింగ్ 1,458)

పూర్తయిన శాతం: 79.22%

నమోదు చేసి వివరాలు ఎక్కించిన కేసులు: 3,524

అరెస్టు చేసిన నిందితుల వివరాలు: 5,493

అంతర్రాష్ట్ర కేసుల అనుసంధానాలు: 14,964

**బాధితులకు ప్రత్యేక హెల్ప్‌లైన్ లభ్యం:**

ప్రజల సౌకర్యార్థం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రత్యేకంగా 8712665600 అనే హెల్ప్ లైన్ కేంద్రం నంబర్‌ను అందుబాటులోకి తెచ్చిందని షిఖా గోయల్ తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం, బాధితుల ధన పునరుద్ధరణ వేదికలకు సంబంధించి సమస్యలు, సందేహాలు ఉన్నవారు ఈ నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీలుగా అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాల్లో వివరణాత్మక దృశ్యరూప సమాచారాన్ని కూడా అందుబాటులో ఉంచామన్నారు. జాతీయ సైబర్ నేరాల నమోదు వేదికతో పాటు ఈ డిజిటల్ సేవలని పౌరులు సద్వినియోగం చేసుకుని సైబర్ మోసాలకు గురైన వెంటనే ఫిర్యాదులు నమోదు చేయాలని, పోగొట్టుకున్న సొమ్మును తిరిగి పొందాలని హోం శాఖ ముఖ్య కార్యదర్శి టిజిసిఎస్బి డైరెక్టర్ షిఖా గోయల్ సూచించారు.

## కేయూ న్యాయ కళాశాలలో ఘనంగా డాక్టర్ కే. జయశంకర్ జయంతి వేడుకలు



**హన్మకొండ, 6 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయ న్యాయ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త డాక్టర్ కే. జయశంకర్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నిమ్మ సుదర్శన్, న్యాయ విభాగం డీన్ ఆచార్య శ్రీనివాస్ డాక్టర్ కే. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో డాక్టర్ జయశంకర్ చేసిన విశిష్ట సేవలను, ఆయన సమాజానికి అందించిన స్ఫూర్తిదాయకమైన భావజాలాన్ని వారు స్మరించుకున్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి డాక్టర్ ఎడ్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వేదాశ్రీ, డాక్టర్ పద్మజ, డాక్టర్ సుజాత, డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ లక్ష్మణ్, బోధనేతర సిబ్బంది, గ్రంథాలయ సిబ్బంది, న్యాయ కళాశాల విద్యార్థులు పాల్గొని డాక్టర్ జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# గొప్ప పరిపాలన దక్షుడు డాక్టర్ కే. జయశంకర్



**కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం**

**హన్మకొండ, 6 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ సిద్ధాంతకర్త, కాకతీయ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డాక్టర్ కే. జయశంకర్ 92వ జయంతిని పురస్కరించుకుని కాకతీయ విశ్వవిద్యాలయం బీసీ సెల్ ఆధ్వర్యంలో గురువారం ఆడిటోరియం ప్రాంగణంలోని బీసీ సెల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ముఖ్య అతిథిగా పాల్గొని డాక్టర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ డాక్టర్ కే. జయశంకర్ గొప్ప పరిపాలన దక్షుడు, బహుభాషా కోవిదుడు, తెలంగాణ సాధన కోసం జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన ప్రతి ప్రసంగం వాస్తవాలు, గణాంకాలతో కూడినదని, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ జయశంకర్ తెలంగాణకు దిక్సూచి అని అన్నారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ ఆయన దూరదృష్టి కలిగిన గొప్ప ఆలోచనాపరుడని పేర్కొన్నారు. ఆచార్య రాజేందర్ కట్ల మాట్లాడుతూ డాక్టర్ జయశంకర్ ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. డాక్టర్ పి. కరుణాకర్ జయశంకర్ భావజాల ప్రాముఖ్యతను వివరించగా, డాక్టర్ ఎం. లింగయ్య తెలంగాణకు ఆయన తెచ్చిన గుర్తింపును కొనియాడారు. డాక్టర్ పుల్లా శ్రీనివాస్ ఆయన గొప్ప విశ్లేషకుడని, డాక్టర్ సంగాల మల్లేశ్వర్ యువతకు స్ఫూర్తి ప్రదాత అని పేర్కొన్నారు. డాక్టర్ ఆర్. కృష్ణయ్య ఆదర్శప్రాయ వ్యక్తిత్వంగా అభివర్ణించగా, తిరునహరి శేషు మేధావిగా కొనియాడారు. ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ నేటి విద్యార్థులు డాక్టర్ జయశంకర్‌ను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని సూచించారు. పాలక మండలి సభ్యురాలు అనితా రెడ్డి డాక్టర్ జయశంకర్ సేవలకు తగిన గుర్తింపు లభించాల్సిన అవసరాన్ని ప్రస్తావించగా, డాక్టర్ రమ ఆయన అంకితభావాన్ని, డాక్టర్ చిర్రా రాజు తెలంగాణ కోసం ఆయన చేసిన త్యాగాలను, ఆచార్య బి. సురేష్ లాల్ ఆయన కార్యసాధనను ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి బీసీ సెల్ సంచాలకులు డాక్టర్ బి. సతీష్ అధ్యక్షత వహించగా, బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆచార్య జయశంకర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం: ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి



**హన్మకొండ, 6 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆశయాలు, ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్‌తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి ఆచార్య జయశంకర్ సిద్ధాంతపరమైన బలాన్ని అందించి ఉద్యమానికి దిశానిర్దేశం చేశారని అన్నారు. 1952లోనే తెలంగాణ ప్రాంత వెనుకబాటుతనాన్ని గుర్తించి, 1969 తొలి దశ ఉద్యమం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు ఆయన క్రియాశీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య జయశంకర్ సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం పలు అభివృద్ధి సూచికల్లో దేశంలోని అనేక రాష్ట్రాల కంటే ముందంజలో ఉందని, ఈ ప్రగతిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వ ఉద్యోగులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మహేందర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## దళితులపై అఘాయిత్యాలను ఆపి, రక్షణ కల్పించాలని డిమాండ్





**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

కర్ణాటక రాష్ట్రంలో దళితులపై నిరంతరంగా జరుగుతున్న అఘాయిత్యాలు, సామాజిక బహిష్కరణ, సంఘ వ్యతిరేక చర్యలకు ముగింపు పలకాలని, దళిత వర్గాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ భీమ సంఘటనే మహా కూటమి కార్యవర్గ సభ్యులు ఫ్రీడమ్ పార్క్ వద్ద నిరసన తెలియజేస్తూ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని దావణగెరె జిల్లా, చన్నగిరి తాలూకాలోని బెలగెరె గ్రామంలో ఉన్న బీరలింగేశ్వర దొడ్డయ్య స్వామి ఆలయ ప్రాంగణంలో గంట కొట్టారన్న కారణంతో, ఇటీవల 150 మంది అగ్రవర్ణ పురుషులు దళిత యువకులను స్తంభాలకు కట్టివేసి, కొట్టి, క్రూరంగా ప్రవర్తించారని భీమ సంఘటనే మహా కూటమి రాష్ట్ర అధ్యక్షుడు కె. మరియప్ప తెలిపారు. మైసూరు జిల్లా, హిరియపట్న తాలూకాలోని హునసికొప్ప గ్రామంలో అగ్రవర్ణాల వారి కోరికలకు అనుగుణంగా ఆట ఆడటానికి నిరాకరించినందుకు దళితులను సామాజికంగా బహిష్కరించడం చాలా సిగ్గుచేటైన విషయమని ఆయన అన్నారు. కర్ణాటక సామరస్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు కన్నాల్లి కృష్ణప్ప మాట్లాడుతూ, రాష్ట్రంలో దళితులపై దాడులు, హత్యలు, అఘాయిత్యాలు, భూదొంగతనాలు, సామాజిక బహిష్కరణ వంటి సంఘవిద్రోహ కార్యకలాపాలను నియంత్రించాలని, అలాగే దళితులు మరియు పీడిత వర్గాల వారు ఆధారపడిన వర్గాల కోసం చట్టపరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు మునిమరప్ప, డాక్టర్ భీమారావు అంబేద్కర్ దళిత సేవా సమితి అధ్యక్షుడు ఎం. మురుగన్, ఎన్. నాగారత్న, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

## అగ్ని-4 పరీక్ష విజయవంతం

**భువనేశ్వర్,ఆగస్ట్6(జై భీమ్ న్యూస్):**

భారత్ మరో కీలక క్షిపణి పరీక్షను విజయవంతంగా పూర్తి చేసింది. అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా ప్రయోగించింది. ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ పరీక్షా కేంద్రం నుంచి విజయవంతంగా ప్రయోగించినట్లు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం (ఆగస్టు 6) వెల్లడించింది ఈ ప్రయోగాన్ని స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరీక్ష సందర్భంగా క్షిపణికి సంబంధించిన అన్ని ఆపరేషనల్, సాంకేతిక ప్రమాణాలను విజయవంతంగా అందుకున్నట్టు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. అగ్ని శ్రేణి క్షిపణులు భారత వ్యూహాత్మక రక్షణ సామర్థ్యంలో కీలకమైనవి. అగ్ని-4 సుమారు 4,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేరుకోగల సామర్థ్యం కలిగిన బాలిస్టిక్ క్షిపణి.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# హసన్పర్తిలో మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు





**హసన్ పర్తి, 6 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

హసన్ పర్తి మండల కేంద్రంలో గురువారం ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి మండల కోఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్ ఆధ్వర్యంలో, హనుమకొండ సఖి వన్ స్టాప్ సెంటర్ సహకారంతో, మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) సుమనవాణి అధ్యక్షతన మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు మానవ మరియు బాలల అక్రమ రవాణా నిర్మూలన, బాల్య వివాహాల నివారణ, మహిళలపై లైంగిక వేధింపుల నిరోధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుమనవాణి మాట్లాడుతూ గ్రామస్థాయిలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులు బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, మహిళలపై లైంగిక వేధింపులు, గృహహింస, వేధింపుల వంటి ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. అనంతరం మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించిన అవగాహన గోడపత్రికలు, పోస్టర్లను ఆవిష్కరించారు. మండల విద్యాశాఖదికారి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా దుష్ప్రభావాలకు గురికాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, బాల్య వివాహాలు మరియు పాఠశాల డ్రాప్అవుట్ల నివారణలో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి మండల కోఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్, హనుమకొండ సఖి వన్ స్టాప్ లీగల్ అడ్వైజర్ శ్రీదేవి, కేస్ వర్కర్ భారతి, మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు గుంతల పూడ్చివేతతో ట్రాఫిక్‌కు ఊరట.. కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న ప్రత్యేక చొరవ



**కాజీపేట, 6 ఆగస్టు 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది రోడ్ల మరమ్మతు పనులు చేపట్టారు. డీజిల్ కాలనీ సెంటర్, కడిపికొండ సెంటర్, కాజీపేట సెంటర్‌లలోని ప్రధాన రహదారులపై ప్రమాదకరంగా మారిన గుంతలను రెడీ మిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసి)తో పూడ్చి రహదారిని చదును చేశారు. ఈ గుంతల వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలకు అవకాశం ఉండటంతో అత్యవసరంగా మరమ్మతు పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న మాట్లాడుతూ, ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. రహదారులపై గుంతల కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడకుండా సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టామని తెలిపారు. మరమ్మతు పనుల అనంతరం ట్రాఫిక్ సాఫీగా సాగడంతో పాటు వాహనదారులకు గణనీయమైన ఊరట లభించిందని పేర్కొన్నారు.

## ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**ఫార్మసీ, నర్సింగ్ ఆఫీసర్లకు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ. అప్పయ్య సూచనలు**





**హన్మకొండ, 6 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), పట్టణ ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీలు)లో పనిచేస్తున్న ఫార్మసీ ఆఫీసర్లు, నర్సింగ్ ఆఫీసర్లు రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఎ. అప్పయ్య సూచించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఫార్మసీ ఆఫీసర్లు, నర్సింగ్ ఆఫీసర్లతో ఆయన వేర్వేరుగా నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో మాట్లాడారు. ఫార్మసీ ఆఫీసర్లు ఈ–ఔషధి పోర్టల్‌లో మందుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన అన్ని ఔషధాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఉప ఆరోగ్య కేంద్రాలకు సకాలంలో మందులు సరఫరా చేయడంతో పాటు, రోగులకు మందుల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాక్సిన్లను నిర్దేశిత ఉష్ణోగ్రతలో భద్రపరచడంతో పాటు, ఈ–విన్ పోర్టల్‌లో వ్యాక్సిన్ నిల్వలు, పంపిణీ వివరాలను నమోదు చేయాలని, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నారు. నర్సింగ్ ఆఫీసర్లు ఆసుపత్రులకు వచ్చే రోగులతో పాటు గర్భిణీ స్త్రీలకు అవసరమైన కౌన్సెలింగ్ అందించాలని, ఈ–ఆరోగ్యం పోర్టల్‌లో అన్ని వివరాలను నమోదు చేయాలని డీఎంహెచ్‌వో సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇచ్చి అవసరమైతే మాత్రమే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయాలని తెలిపారు. ఫార్మసీ ఆఫీసర్ అందుబాటులో లేని సమయంలో వ్యాక్సిన్ల భద్రత, పంపిణీ బాధ్యతలను నర్సింగ్ ఆఫీసర్లు నిర్వహించాలని, ఎన్‌సీడీ స్క్రీనింగ్‌ను పూర్తిచేసి అన్ని కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశాల్లో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి. మదన్ మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి, మాతా శిశు సంక్షేమ కార్యక్రమ అధికారి డాక్టర్ రజిత, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రీకృష్ణారావు, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మురళి, డెమో అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులకు ఎల్లవేళలా అండగా ఉంటా: దాస్యం వినయ్ భాస్కర్

**వరంగల్, 6 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపమైన నాటక కళను సజీవంగా ఉంచుతున్న రంగస్థల కళాకారులకు ఎల్లవేళలా అండగా ఉంటానని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో ఈ నెల 10న జరగనున్న జాతీయ స్థాయి నాటక పోటీలకు ఎంపికైన కాకతీయ నాటక కళా పరిషత్ కళాకారులను గురువారం వరంగల్‌లోని పోతన విజ్ఞాన పీఠం వద్ద కలిసి ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కళాకారులకు ఆర్థిక సహాయం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, సాంకేతిక విప్లవం, డిజిటల్ వినోదం ఎంతగా అభివృద్ధి చెందినా నాటక రంగానికి ఉన్న ప్రాధాన్యం ఏమాత్రం తగ్గలేదన్నారు. చరిత్ర, సంప్రదాయాలు, పురాణాలు, సామాజిక సమస్యలను నాటకాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం కల్పిస్తున్న కళాకారులు అభినందనీయులని కొనియాడారు. పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాల ద్వారా తెలంగాణ భాష, యాస గొప్పదనాన్ని ప్రపంచానికి చాటుతున్నారని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా కళపై మక్కువతో నాటక రంగాన్ని కొనసాగిస్తున్న కళాకారులకు సమాజం రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ మట్టి సంస్కృతి, నాటక వైభవాన్ని భావితరాలకు అందిస్తున్న కళాకారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. జాతీయ స్థాయి పోటీల్లో "సమ్మక్క--సారలమ్మ", "మహారాణి రుద్రమదేవి" నాటికలను ప్రదర్శించనున్న కళాకారులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంజీవ రెడ్డి, ఆకుల సదానందం, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, విద్యార్థి నాయకుడు బైరపాక ప్రశాంత్, నాటక కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఆగస్టు 7న బి.టెక్ విద్యార్థినులకు ఓరియంటేషన్




**హన్మకొండ, 6 ఆగస్టు 2026 (జై భీమ్)**

కాకతీయ విశ్వవిద్యాలయం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ తొలి సంవత్సరం విద్యార్థినుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఆగస్టు 7 (శుక్రవారం) ఉదయం 10.00 గంటలకు విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కే. బిక్షాలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. వరంగల్ ఎన్ఐటీ ఆచార్యులు ఆచార్య బి. స్ఫూర్తి విశిష్ట అతిథిగా పాల్గొననున్నారు. అదేవిధంగా, కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి గౌరవ అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. బి.టెక్ తొలి సంవత్సరం విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఈ ఓరియంటేషన్ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై, విశ్వవిద్యాలయం, కళాశాల విద్యా విధానం, నియమ నిబంధనలు, విద్యా అవకాశాలపై అవగాహన పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కే. బిక్షాలు కోరారు.

## సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను సమీక్షించిన జిల్లా కలెక్టర్ డా. సత్య శారద



**వరంగల్, 6 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ డా. సత్య శారద గురువారం సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి భవన నిర్మాణం, మౌలిక వసతులు, విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుధ్యం తదితర పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ఆసుపత్రిని త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే వరంగల్ జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఈ రమేష్ బాబు, విద్యుత్ శాఖ ఎస్ఈ ఆనందం, ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ రాజా రెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఇంజనీర్ శరవణ్, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, ఈఈ దేవిక చౌహాన్, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**పవర్ ప్లాంట్, ఈఎస్ఐ ఆస్పత్రి, ఆర్ఓబీల నిర్మాణంపై వినతి**

**రామగుండం, 6 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఐఏఎస్‌ను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గురువారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ప్రతిపాదిత 1ఐ800 మెగావాట్ల పవర్ ప్లాంట్ నిర్మాణం, ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్ఓబీలు) నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి అవసరమైన అనుమతులు త్వరితగతిన మంజూరై పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. రామగుండం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, వివిధ ప్రాజెక్టులకు పరిపాలనా అనుమతులు, నిధుల కేటాయింపులో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రస్తావించిన అంశాలపై స్పందించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి అభివృద్ధి పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# తండ్రి నాగబాబుతో వరుణ్ తేజ్ బరి

**కూతురు నీహారికి నిర్మాతగా యదువంశీ మూవీ**




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు ముందు చిత్రబృందం జోరుగా ప్రమోషన్స్ నిర్వహిస్తుండగా, తాజాగా ఓ ఇంటర్వ్యూలో వరుణ్ తేజ్ తన తదుపరి సినిమా గురించి ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. తొలిసారిగా తన తండ్రి నాగబాబుతో కలిసి ఒకే సినిమాలో నటించబోతున్నట్లు ప్రకటించారు. నాగబాబు నటుడిగా చిరంజీవి, పవన్ కళ్యాణ్, రామ్ చరణ్, సాయిధరమ్ తేజ్ సహా మెగా కుటుంబానికి చెందిన పలువురు హీరోలతో కలిసి నటించారు. అయితే ఆశ్చర్యకరంగా తన కుమారుడు వరుణ్ తేజ్‌తో మాత్రం ఇప్పటివరకు పూర్తి స్థాయి సినిమాలో స్క్రీన్ షేర్ చేసుకోలేదు. గతంలో 'హ్యాండ్స్ అప్' సినిమాలో వరుణ్ తేజ్ చిన్ననాటి పాత్రలో కనిపించినప్పటికీ, తండ్రీకొడుకుల మధ్య ఒక్క కాంబినేషన్ సీన్ కూడా లేదు.ఇప్పుడు ఆ లోటును 'బరి' సినిమా భర్తీ చేయనుంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్, నాగబాబు కలిసి నటించడమే కాకుండా, ఇద్దరి మధ్య కీలకమైన కాంబినేషన్ సీన్లు కూడా ఉంటాయని వరుణ్ వెల్లడించారు. తండ్రితో కలిసి నటించడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభూతిగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇక 'బరి' చిత్రాన్ని నాగబాబు కుమార్తె నిహారిక కొణిదెల నిర్మిస్తున్నారు. 'కమిటీ కుర్రాళ్లు' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు యదు వంశీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల కాలికి గాయం కారణంగా విశ్రాంతి తీసుకున్న వరుణ్ తేజ్, పూర్తిగా కోలుకున్న తర్వాత 'బరి' షూటింగ్ ప్రారంభం కానుందని తెలిపారు. తొలిసారి రియల్ లైఫ్ తండ్రీకొడుకులు వెండితెరపై కలిసి కనిపించనున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌పై మెగా అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. 'కొరియన్ కనకరాజు' తర్వాత వరుణ్ తేజ్ కెరీర్‌లో 'బరి' మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.




## నవంబర్ 6న

## రామాయణ విడుదల

**అధికారికంగా ప్రకటించిన చిత్ర బృందం**

నితీశ్ తివారీ దర్శకత్వంలో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'ను ప్రకటించినప్పుడే రెండు భాగాల విడుదల ఎప్పుడనేది చిత్రబృందం వెల్లడించింది. ఈ ఏడాది దీపావళి కానుకగా.. మొదటి భాగాన్ని, వచ్చే ఏడాది దీపావళికి రెండో పార్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ తెలిపారు. తాజాగా మొదటి భాగం అధికారిక విడుదల తేదీని చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించింది. నవంబర్ 6న రామాయణను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలుపుతూ పోస్ట్ పెట్టింది అదే రోజున రణ్‌బీర్



## కింగ్ జాకీ క్వీన్..మూవీపై ఆసక్తికర అంశం

**అనుష్క కోసం 12 ఏళ్ల క్రితం రాసిన కథగా ప్రచారం**

ఈ శుక్రవారం విడుదల కానున్న తెలుగు చిత్రాల్లో 'కింగ్ జాకీ క్వీన్ ' ఒకటి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, ప్రచార చిత్రాలతో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించిన ఈ పీరియాడిక్ క్రైమ్ డ్రామాపై సినీ వర్గాల్లో మంచి అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రానికి మరో ప్రత్యేకత ఏమిటంటే.. ప్రముఖ దర్శకుడు కిరణ్ కుమార్ చివరిసారిగా దర్శకత్వం వహించిన సినిమా ఇదే కావడం. దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన ప్రమోషనల్ కార్యక్రమంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా వెల్లడించిన ఆసక్తికర విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. దర్శకుడు కిరణ్ కుమార్ ఈ కథను దాదాపు 12 ఏళ్ల క్రితమే సిద్ధం చేశారని వెల్లడించారు. అప్పట్లో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కించాలని భావించిన కిరణ్ కుమార్, కథానాయిక పాత్ర కోసం స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టిని దృష్టిలో పెట్టుకుని స్క్రిప్ట్ రూపొందించారట. అయితే వివిధ కారణాలతో ఆ ప్రాజెక్ట్ అప్పట్లో సెట్స్‌పైకి వెళ్లలేదు. దీంతో సినిమా నిలిచిపోయినా, దర్శకుడు మాత్రం కథను వదిలిపెట్టకుండా కాలానికి అనుగుణంగా మార్పులు చేస్తూ మరింత బలోపేతం చేశారని తెలిపారు. మొదట అనుష్క కోసం రాసిన పాత్ర, కాలక్రమేణా మార్పులు చెంది ఇప్పుడు నటి యుక్తి తరేజా పోషిస్తున్న పాత్రగా రూపుదిద్దుకుందని సమాచారం. దీంతో ఎన్నో ఏళ్లుగా దర్శకుడు మనసులో ఉన్న కథ చివరకు 'కింగ్ జాకీ క్వీన్' రూపంలో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమాతో మరో ఆసక్తికర అంశం కూడా ఉంది. ప్రముఖ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సోదరుడు శశి ఓదెల ఈ చిత్రంతో హీరోగా సినీ రంగంలోకి అడుగుపెడుతున్నారు. తొలి చిత్రంతోనే పీరియాడిక్ క్రైమ్ డ్రామా వంటి విభిన్న కథను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది.ఇక హీరో దీక్షిత్ శెట్టి కీలక పాత్రలో నటిస్తుండగా, యుక్తి తరేజా కథానాయికగా కనిపించనున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు పూర్ణచంద్ర తేజస్వి సంగీతాన్ని అందించారు.

## ఆవారపన్‌కు సీక్వెల్ రెడీ

2007లో విడుదలైన క్లాసిక్ యాక్షన్ డ్రామా 'ఆవారపన్'. ఇమ్రాన్ హష్మీ, దిశాపటానీ నటించిన ఈ సినిమాకు 19 ఏళ్ల తర్వాత సీక్వెల్ తెరకెక్కింది. ఆగస్టు 14న ఈ 'ఆవారపన్ - 2' థియేటర్‌లలో సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. శివమ్ పండిట్ పాత్రలో ఇమ్రాన్ తిరిగి వస్తున్నాడంటూ వీడియోను పంచుకుంది. నితిన్ కక్కర్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది.

